...విక :

# లక్కాగాజు

రచన: ఆళ్ళ పిచ్చయ్య

లక్కాగాజు—

ఆ గాజును చూసినప్పుడల్లా గుండెల్లో నిండైన బాధ రేకెత్తుతూ వుంటుంది. ఈ గాజును అలంకరించిన అమృతహస్తం యీనాడు కుమిలి క్రుళ్ళి పోయిందో, కాంతు లీనుతూ పెరుగుతూందో తెలియదు......

ఆనాడు బహుశా శుక్ల చతుర్దశి అనుకుంటాను...'వైట్ సావేజ్' చూసిన ఉద్రేకంతో, ఆపుకోలేని తియ్యని భావాలతో మౌంట్ రోడ్డున పోతూనే వున్నాను...'పర్దా'కట్టిన రిక్షాలు, ఆంగ్లో యిండియన్ జంటలు నన్ను దాటిపోతూ వుంటే హృదయంలో ఎవేవో తియ్యటిభావాలు పుట్టుకొస్తూ వున్నాయి.

'కూవం' నదిలో దూరంగా కనబడుతూ వుంది, చల్లగా, హాయిగా తేలుతూవున్న తెప్ప...రెండు నీడలు మాత్రం కనబడుతున్నాయి....నిరాశగా కాసేపు నిలబడి, ముందుకు సాగాను......

ఉన్న ఒక్క సిగరెట్టు ముట్టించి 'వత్సల' మద్రాసు రాకకై ఆలోచిస్తూ, ముందుకు నడుస్తున్నా...చుట్టూ నిశ్శబ్దంగా వుంది...మిలిటరీ లారీ మాత్రం మహాజోరుగా అప్పుడే నన్ను దాటిపోయింది.

'మన్రో' విగ్రహం దాదాపుకు వచ్చాను... చెట్లలోని చంద్రుణ్ణి చూసుకుంటూ నడుస్తున్నా. దూరంగా 'రిప్పన్' భవనంలోని గడియారం రాత్రి 12-45 చూపుతూ వుంది.

ఏదో మూలుగు వినబడింది. వినీ విననట్లు నాలుగడుగులు ముందుకు వేశాను. కాని మళ్ళీ మూలుగు వినబడింది. అలాగే నిలబడిపోయాను. పది గజాల దూరంలో నాలుగు కుక్కలు, మరో కుక్కను మచ్చిక చేస్తూ కాబోలు, దానిచుట్టు తిరుగుతూ కామోద్రేకంతో గమ్మత్తైన శబ్దాలు చేస్తున్నాయి. బహుశా కుక్కలే కాబోలు ఇలా మూలుతున్నాయని అనుకుంటూ ముందుకు మరి రెండడుగులు వేశాను. కాని మరింత బిగ్గరిగా శబ్దం వినబడుతూ వుంది.

మెల్లిగా ఆ శబ్దంవైపు వెళ్ళాను. ప్రకృతి అంతా ఎంతో శాంతంగా అందంగా వుంది.

ఎవరో ఆ చెట్టునీడ క్రింద పడిపోయి మూలుగుతూ వుంది. నా కళ్ళను నేను నమ్మలేక పోయాను నగ్నంగా పడిపోయి వుంది. కళ్ళు మూతపడి వున్నాయి. తల వెంట్రుకలు చెరిగిపోయి వున్నాయి ఆ వెన్నెల కాంతిలో, ఆ వెలుగు నీడలలో; ఆమె పచ్చని రొమ్ము, తొడలు ఉద్రేకాన్ని పుట్టిస్తూ, అగుపిస్తున్నాయి. నగ్నంగా, అదో వంకరగా పడుకొని మూలుగుతూ వుంది. నిజంగా ఎంత అందంగా వుందీ యీ అమరకన్య! చాలా ఆశ్చర్యంగా వుంది? అసలు దెయ్యా లుంటాయా అనే ప్రశ్న బయలుదేరింది నాలో.

నరాలు వేడెక్కుతున్నాయి. శరీరమంతటా తియ్యటి బాధ ప్రవహిస్తూ వుంది. ఉద్రేకంతో దగ్గరకు వెళ్ళాను. పాపం, ఆమె మూలుతూవుంది. నోటి వెంబటి మాటలు రావడంలేదు. కళ్ళూ తెరవలేదు, తొడలమీద మాత్రం రక్తం కనబడుతూ వుంది.

ఏం చెయ్యడానికి తోచడంలేదు. 'మన్రో' విగ్రహం చాటున యెవరో నలుగురు సిగరెట్లు కాలుస్తున్నారు ఆమె ప్రక్కనే కూర్చున్నాను. ఎవడో మిలిటరీ వాడు నన్ను రాసుకుంటూ వేగంగా పోయి, వాళ్ళతో కలిశాడు.

చాలా అగమ్యగోచరంగా వుంది. వెర్రిగా నవ్వుతూ వాళ్ళు వెళ్ళిపోయారు. కొద్దిదూరంలో కుక్కల అరుపులు తప్ప అంతా నిశ్శబ్దంగా వుంది. పై చెట్టునుండి ఒక ఆకు రాలి ఆమె రొమ్ముమీద పడింది. ఆమె మూలుగుతూనే వుంది. మెల్లిగా ఆకు తీశాను. చేయి తగిలింది కాబోలు ఆమె శరీరం కదిలింది.

మెల్లిగా తట్టాను; చల్లగా కనులు విప్పింది. ఎంతో లోతుగా నావంక చూసింది. పాపం, దాహం కాబోలు ఎక్కడ దొరుకుతాయి నీళ్ళు. చప్పున జ్ఞప్తికొచ్చింది. జేబులో 'లవంగాలు' వున్నాయి. ఆప్యాయంగా రెండు లవంగాలు ఆమె

నోట్లో పెట్టాను. ఆమె నగ్నంగా వుండే? ఎలా యీమెను లేపడం? నా దగ్గర వేరే గుడ్డలు లేవు ఆమె నగ్న శరీరం వంక చూడడం సిగ్గుగా వుంది. జేబురుమాలు తీసి, కప్పివేశాను. మెల్లిగా చేయూత యిచ్చి ఆమెను లేపి కూర్చోబెట్టాను. నిండుగా నావంక చూసింది. ఇప్పుడు ఏం చెయ్యడం? ఏమీ తోచడంలేదు. పది నిముషాలు అలాగే నా చేయి మీద వాలి కూర్చుంది. బాధతో మూల్గుతున్నా, సిగ్గుతో ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

నాకు లోపల బనియను, డ్రాయరు వుంది. పైజామా, షర్టు విప్పి ఆమెకు యిచ్చాను. లేచి కట్టుకోలేని స్థితిలో వుంది. ఎలాగో ఆమెకు పైజామా షర్టు తొడిగాను.

అలాగే ఆమె కనురెప్పలవంక చూస్తూ కూర్చున్నాను. కాసేపటికి 'ఏమండీ' అంటూ నా హృదయంలో తలపెట్టుకొని ఏడ్వడం మొదలుపెట్టింది పాపం.

చొక్కాతో ఆమె నేత్రాలు తుడిచి, ఆమెను లేపి నిలబెట్టాను. ఆమె నడుముకి నా చేయి ఆధారమిచ్చి మెల్లిగా బయలుదేరాం.

నా మెడచుట్టూ ఆమెచేయి పెనవేశింది. ఎంత అందంగావుకది యీమె? అలాగే బ్రిడ్జివరకు వచ్చాం. రిక్షాపోతూవుంటె పిలిచి, రాయపేటలో దిగాం. మెట్లెక్కి మేడపైకివెళ్లాం. ఎదురుగా వసారాసందులో ఎవరో స్నేహితురాలు దొరికింది కాబోలు—ఆ రెండుపిట్టలు చిన్నశబ్దాన్ని చేస్తున్నాయి. గదితీసి లైటువేశాను. ఆడసంసారంలేని బ్రతుకు. ఆపరుపూ, ఆసిగరెట్టుపెట్టె, ఆపత్రికలూ, ఆ 'హెయిగ్' సీసా, చిందరవందరంగా వున్నాయి. ఆమెను కుర్చీలో కూర్చోబెట్టాను. ఆదీపపువెలుగులో నిజంగా ఎంత అందంగావుంది. పెదిమలు మెరుస్తూ ఎంత అందంగావున్నాయి. చెక్కిలిమీది నల్లటిగీత మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఆ పైజామా, చొక్కా తొడుక్కుంటె 'రాగిణి' ని మరిపించేస్తూవుంది.

తలనిరుముతూ అడిగాను తినడానికి ఏమన్నా కావాలా అని.

స్నానంచేస్తానంది. 'బాత్ రూము' చూపించి, తలుపుప్రక్కనే నిలబడివున్నాను. ఏవేవో తియ్యటి కలలు' నిలబడే కంటున్నాను. స్నానంచేసి గదిలోకి వచ్చింది. నాచొక్కా, పంచె కట్టుకుంది. కాని బాధతో మూల్గుతూనే వుంది.

రాత్రి 2½ గంటలవుతుంది. హోటళ్లు మూసి వున్నాయి. క్రింద దుకాణంలో అరటిపండ్లు బిస్కెట్లూ, క్రష్ తెచ్చాను. ప్రక్కనే కూర్చుని తినమన్నాను. 'మీరో?' అంది. 'మిగిలింది నాకు' అన్నాను. ఎందుకండీ, నామీద అంత అభిమానం, అని నాచేతిలో రెండు బిస్కట్లువుంచి, తాను రెండు నోట్లో వేసుకుంది. నిజంగా ఎంత అందంగా తింటూవుంది? క్రష్ గ్లాసులోపోసి చేతి కందించాను. తిరిగి నానోటి కందించింది. మిగిలింది త్రాగింది.

'బెడ్' చక్కగా పరిచాను. తీసుకొచ్చి పడుకోబెట్టాను. గదితలుపువేసి, ప్రక్కనే కూర్చున్నా. గదిబయట వసారాలో పిట్టలు కిలకిలమంటున్నాయ్. తలనిరుముతూ పేరడిగాను. 'నీలివేణి' అని చెప్పింది. లైటు సగంనీడలో 'హెడ్డీలామర్' బొమ్మ టేబుల్ మీద మరింత ఉద్రేకాన్ని కలిగిస్తోంది. అసలువిషయం ఏమిటీ, తనుఎవరు చెప్పవలసిందని అడిగాను. పాపిష్టిజీవితం ఎందుకండీ అంటూ బ్రతిమాలింది. చెప్పవలసిందని వేడుకున్నాను. శరీరంలో తియ్యటిబాధ తిరుగుతూనే వుంది. కళ్లల్లోచూస్తూ చెప్పింది.

“మీరెవరో? నేనెవర్నో? యీరాత్రి యిలా గదిలో కలిశాం. వింతగాలేదు మీకూ? మాది అమలాపురం. నాకు మానాన్న, మానాన్నకు నేనూ—యిద్దరమే ఈప్రపంచలో తోడుగావుంటా. నాన్నకు గుండెనొప్పి ఎక్కువయితే మద్రాసు వచ్చాం. ఆసుపత్రిలో చేరాడునాన్న. నాన్న బేరంలో సంపాదించినడబ్బు అయిపోయింది పదిరోజుల్లో. మానాన్న నన్ను విడిచిపోయాడు. డబ్బులేదు. ఆకలి. కడుపు కాలిపోతూవుంది. ఎలా ఆకలితీరడం. శరీరాన్ని తాకట్టుపెట్టుకుందామని చివరకు నిశ్చయించుకున్నాను ఆకలికి ఆగలేక. యివాళ సాయంకాలం సినిమాదగ్గర ఒక మిలిటరీ వాడిని ఆశించాను. నన్ను తీసుకువెళ్లాడు ఆ మైదానంలోకి. అంతలో మరిముగ్గురుకలిశారు అతన్ని. కసాయిలు నలుగురుకలిసి, బలవంతంగా చీరె విప్పేసి, పశువుల్లా నలుగురూ”—అంటూ ఆమె ముఖాన్ని నాగుండెల్లోపెట్టి ఏడ్వడం మొదలుపెట్టింది.

ఇరవైయేండ్ల యువతి అలా మీదపడుకొని వుంటె శరీరం పులకరించదూ? తల నిరుముతూ ఓదార్చాను. నిజంగా ఎంత క్లుప్తంగా, హృదయవేదనను చెప్పగలిగింది.

ఇద్దరం పడుకున్నాం. నాలో నరాలపొంగు అధికమవుతూవుంది. ఆమె నాలో వుద్రేకాన్ని మరింత కలిగిస్తూవుంది. ఎంతో ఆశతో ఆమె కను రెప్పల్ని ముద్దుపెట్టుకున్నాను. మరింతదగ్గరకుచేరి కౌగిలించుకుంది.

ప్రొద్దున నేను లేవకముందే, గది శుభ్రంచేసింది. కళ్లు తెరిచేటప్పటికి తలప్రక్కనే కూర్చొనివుంది. ఎంతఅందంగా నవ్వింది 'నీలివేణి'. పాలుత్రాగి కూర్చున్నాం. 'దిపాళి' తిరగవేస్తూ బొమ్మలు చూస్తుంటె, తలకు నూనెరాశింది. ఆసుపత్రికి వెళ్లాలంది కాస్త బాధతో. తీసుకొనివెళ్లి వచ్చాను. అంతలో సుబ్బారావు ఆఫీసుకువెళ్లుతూ నాకోరకు దిగాడు. గదిలోని అమ్మాయిని చూసి, కాస వెనక్కుతగ్గాడు. చుట్టాలంటూ సాకుచెప్పి, ఆఫీసుకు 'కాజుయల్‌లీవ్' పెట్టి అతన్ని పంపించాను.

బజారుకువెళ్ళి చీరె కొనుక్కొచ్చి యిచ్చాను. ఎంతో ఆప్యాయంగా కట్టుకుంది. మధ్యాహ్నం భోజనం తనే వడ్డించింది. ఆరోజుల్లా యిద్దరం సినిమాలు, బీచ్, తిరిగాం. రాత్రి 10 గం॥ ల వరకు ఆ యిసుకతిన్నెలలోనే గడిపాం. రాత్రి గదికి చేరేటప్పటికి 'వత్సల' రేపుసాయంకాలం మద్రాసు వస్తున్నానని లేఖ పడివుంది.

రాత్రి ఫంతహాయిగావుంది? మరునాడు భోజన సదుపాయాలు, అవీయివీచేసి, మరోరోజు కాజుయల్ లీవురాసి, అడయార్ వెళ్లాను.

వచ్చేటప్పటికి రూము తాళంవేసివుంది. ఆలోచనలోపడ్డాను. తాళం పట్టుకొనేటప్పటికి వూడివచ్చింది. గబగబా లోనికివెళ్లాను. టేబుల్‌మీద వుత్తరంవుంది.

"మీ మనస్సుకు కష్టం కలిగిస్తున్నాను. మిమ్ములను నేను బ్రతికినంతకాలం మరిచేపోలేను. నా మూలకంగా, మీరు చెడిపోవడం నాకిష్టంలేకపోయింది. అంతే మరేమీలేదు. నాకోరకు వెతకకండి. మీ ఋణాన్ని తీర్చుకోలేను. నాగుర్తుగా యిదిగో—యీ లక్కగాజు వుంచుకోండి."

నాగుండె నీరయింది. కిటికీగుండాచూశాను వసారాలో ఒక్క పిట్టమాత్రమే వుంది.

హృదయావేదనతో లక్కగాజును హృదయానికి అద్దుకున్నాను.

ఆగాజును చూసినప్పుడల్లా గుండెల్లో నిండైన బాధ రేకెత్తుతూవుంటుంది. లక్కగాజు—

# ఎందుకీ సందేహం

* జన్మహక్కు జీవితమే.—

* హృదయాన్ని పొత్తుకొనే సంగీతం, ఏడుపు యొక్క సుఖ ప్రతిబింబం.

* నియమాన్ని, నాగరికతని, సభ్యతల్ని కల్పించిన బుద్ధే, ప్రకృతి మాధుర్యానుభవానికి, మానవునికి మధ్య అడ్డయి నిలచిన సైతాన్?

* పిచ్చివాళ్లూ, పశుపక్ష్యాదులు, ప్రకృతి కలిసి ఒక కంచంలో తిని, ఒక మంచంమీద ఒక పంచక్రింద పడుకుంటారు.

* నిమ్నవర్గ నాయకుడు తన వర్గ ప్రాతినిధ్యం నిల్చి ఉండడానికి-సంఘంలోంచి ఆ నిమ్నతా విబేధం తొలగిపోవడం లోలోన ఇష్టంలేక ఏడుస్తాడు.

* 'చెడు'నుగూర్చి ఆందోళనలు హైరణచేసి పేరు సంపాదించేందుకు సదా ఆ 'చెడు' అభివృద్ధి పొందాలని కోరే వాడూ సంస్కర్తే—!

* రేపు మనదే, అనుకొని, ఈనాటిని పరులపాల నొదలటం అనే తెలివి-; నీటిలో మాంసపు ముక్క చూచి యేదో చేసిన దేనికో ఉంది.

* అజంతాగుహాల చిత్ర సుందరులు కాఫీ త్రాగడంవల్ల అంత సౌందర్యం పొందారు. (ఒక కాఫీ ప్రకటన చిత్రశాసనం యిందుకాధారం)

* మొట్టమొదట చెన్నరాజధానిలో సాంబారుయుత కాఫీ హోటలు సంస్థాపించిన సంస్థాపితామహుడు ఎవడో పరిశోధించి చరిత్రను ధన్యపర్చడం చారిత్రక పరిశోధకుల విధి— పరమావిధి.

---

దేహారోగ్యకారణాలచేత నేను "ఆనందవాణి"ని విడిచివెళ్ళవలసినందుకు విచారిస్తున్నాను. అనేకవిధాల ప్రోత్సాహాన్ని చేయూతనూ ఇచ్చిన పాఠకులకు, మిత్రులకు, నిర్వాహకులకు నా కృతజ్ఞతలు.

-యం. యస్. మూర్తి.